అట్లా చరిత్రాత్మకమైంది ఈగది! నాటికి నేడు ఈగదిలో, కాలుపెట్టాను. అని చెప్పుతూ గణేశంగారు కథపూర్తిచేశారు.

యతి ప్రాస మహా సభ

౧

తెల్లవారి చూసేసరికి సారంగధరుడి మెట్టమీద ఒక పెద్ద తాటాకుపందిరి. దాని పైనీ—కిందా—మామిడాకు తోరణాలు, రంగురంగుల జెండాలు, ఎరుపు, పచ్చ, నీలం కాగితాల గొలుసులూ, బుట్టలూ లేతగాలికి ఊగుతూ కన్నులపండువుగా కనిపిస్తున్నవి. ఆ పందిరికి చుట్టూ చినచిన్న కొత్త తాటాకు పాకలు అందంగా బారులు తీర్చి వీథులువీథులుగా ఉన్నాయి.

ఉదయం ౭ గంట లయింది. బాలసూర్యుని బంగారు కాంతిలో జైలురోడ్డు మొదలుకొని మెట్టదాకా 'దయచేయుడు. దయచేయుడు' అన్న ఆహ్వానపు అట్టలకు అంతు లేదు. వీరభద్రపురంనుంచి వీరేశలింగంతోటకు ఏదో పనిమీద పోతూన్న నన్ను చూసి మిత్రులు సూర్యనారాయణశాస్త్రి గారూ సీతాపతిగారూ తొందరగా వెడుతూ "శాస్త్రీ, చప్పున రావాలి. గొప్ప తమాషా జరిగిపోతోంది. పరుగులమీద పోవాలిర" మ్మన్నారు. 'ఊఁ. ఏదో రాగిశాసనమో, మరణ

శాసనమో దొరికింది బాబోలు' అని నవ్వుతూ "ఆగండి. ఏమి టాతొందర ? అన్నాను. రద్దూ ! వస్తేగాని చెప్పం ?" అన్నారు. 'పదండి' అని బయలుదేరాను.

౬

సీతాపతిగారు ముందు నడుస్తున్నారు. ఎట్టకేలకు మొట్ట సమీపించాం. పెద్ద తాటాకు పందిరి ఏదో సభా భవనంలాగా కనిపిస్తోంది. "కొంపదీసి ఆంధ్రసాహిత్య పరిషత్తు అభినవ కవులకు జడిసి ఇక్కడ జరగడంలేదుగదా" అన్నా సూర్యనారాయణశాస్త్రిగారితో. "అంతకన్న ఒక మహాసంస్థ ఒహా టిక్కడ లేవదీశారయ్యా మహానుభావా" అని తీర్చిన 'ఆర్చి' ఒకటి చూపించారు. దానిమీద "అఖిలాంధ్రయతి ప్రాస మహాజనసభ" అనే కాకిబంగారంఅక్షరాలు జిగజిగమన్నాయి ఒక్కసారి. సీతాపతిగారు మాతో రహస్యంగా "ఇక్కడ మన మెవరమో ఎవ్వరికీ తెలియగూడదు. తెలిస్తే వీళ్లు మనను దంపేస్తారు. జాగ్రత్త" అని హెచ్చరించారు.

౭

బారులుతీరిన తాటాకు పాకల మొదటిశ్రేణిలో వెళ్లినిలుచున్నాం. నిదానించి సీతాపతిగారు ఒకపాక దగ్గరకు నడిచారు మేము వెంబడించాం. ఆ పాకకు ఒకవైపున 'ఓరుగల్లు ప్రతినిధులు' అని వ్రాయబడిన ఒక అట్ట వ్రేలాడుతున్నది. పాక

నిండా ప్రతినిధులు 'కోదండరామునకు. జై' అని కోలాహలం చేస్తున్నారు. సీతాపతిగారు చూపుడువేలు తిప్పుతూ "అదిగో అందులో వారికందరికీ నాయకుడుగా 'అజమాయిషీ' చేస్తున్న ఆడబుల్‌పన్నా మనిషి 'అనఘం' గారు ఈయన బమ్మెర పోతరాజుగారికి సయాన మేనత్తకొడుకు. ఆయన పక్కను పరువుచుట్ట కానుకుని కూర్చున్నాయన 'అమరం' గారు. యీయనా 'అమలం' 'విమలం' 'ప్రవిమలం' ఒక వేలువిడిచిన పెత్తల్లి పింతల్లిబిడ్డలు. వీరి ఎడంపక్కను కూర్చున్న కుర్రవాడు 'నెజి'. అతని పక్క వాడు ఆతని ఆత్మబంధువు 'మజి.'" అని చెప్పి ఈమూల కూనిరాగాలు తీస్తున్నాయన ఎవరు చెప్మా అని ఆలోచిస్తుండగా ఓస్ ఈయన 'పరగం' గారండీ అన్నా కొంటెగా. 'రైటో. పదండి ముందు' కన్నారు సీతాపతిగారు.

త

అది కొండవీటి ప్రతినిధులున్న బస.

'నమ స్సాంబశివాయ' అనే కలకలం మాకు దూరానికే వినబడింది. అంతా కుస్తీచేసిన వస్తాదు జబర్దస్తీగా ఉన్నారు. దగ్గరకు వెడితే తంతారేమో అన్న భయంమీద ఓరగా నిలుచున్నాం. సీతాపతిగారు ఎవరి కోసమో వెదికివెదికి ఉండ బట్టక పాకలోదూరి 'అయ్యా, ధరాదేవిగారు రాలేదేమండీ' అని అడిగారు. పాకంతా గొల్లుమని నవ్వి 'ఈ సభాకార్య

క్రమం మీకేమీ తెలియదు కాబోలు. ఈ మహాసభకు మాధరాదేవిగారే అధ్యక్షత వహిస్తారు. వారుత్రోవలో సన్మానసభలూ, స్వాగతపత్రాలూ విధీ విరామం లేకుండా అందుకుంటూ ఈవేళ ౯ గంటల రైలుమీద వస్తున్నారు. బ్రహ్మాండమైన ఊరేగింపుతో గోదావరిస్టేషనుకు వెళుతున్నాం' అన్నారు.

'వెళ్లి అంతా గోదారిలో దిగిపొండి. ఆంధ్రకవిత్వంపీడ వదలిపోతుంది.' అన్నారు సన్నగా సూర్యనారాయణ శాస్త్రిగారు.

నేను కొంటెగా అందులో ఒకాయనను 'అయ్యా, తమపే రెవరండీ!' అన్నాను. అతడు గూబకు బెత్తెడు చూసినట్టు చూసి 'రాజమండ్రీ కుర్రాళ్లకి బొత్తిగా కళ్ళు కనిపించడం లేదు. ఏనాడూ మమ్మల్ని చూస్తేగా' అన్నాడు 'గుస్సా' అయిపోయి. 'పేరడుగుతే తప్పండీ!' అని సీతాపతిగారు సర్ది "శాస్త్రీ, తంటా తెచ్చావూ! వాళ్ల నడక్కు—రంగం చెడుతుంది. నేను చెబుతా వినండి. 'కెరలి' గాడు. వాడిపక్క వాడు 'పంబిన' వాడు. రుద్రాక్షతావళం తిప్పుతున్నాయన 'ఒరిమ' గారు. అతనికెదురుగుండా ఆవెర్రి మొహంవాడు 'అర్థి' ఈ హడావడిగా పరిగెత్తేవాడు 'వీకం' గారు." అని చెబుతూ ముందుకు నడిచారు.

ప

ఇంకొక పాక. అది 'జమీందారీ' ఫాయా మనుష్యులుండ దగినంత 'హోదా'గా తయారుచేశారు. ఆ 'రాత్రియుంబవల్ మరపురానిహాయలు' చూస్తే ఒక మహాసామ్రాజ్యం పంచుకు అనుభవిస్తున్న దర్జా గోచరిస్తుంది. పరచిన పట్టుతివాసీ మీద ఒక పెద్దమనిషి హుక్కా పీలుస్తూ 'ఫక్రుషాదుషా' లా ఉన్నాడు. సీతాపతిగారు తేరిచూచి 'ఓహో! ఈ విజయ నగరప్రతినిధులండీ. ఆహుక్కా పీలుస్తున్నాయన 'హరువు మొల్లం' గారు. మాంచి హుషారైనవాడు. ఇటువెంపు చూస్తున్నాడే అతడు 'అల్లన.' ఇతడు పెద్దన్నగారి దత్త పుత్రుడు. ఆ పొడుగాటివాడు 'వావిరి.' ఇతనికీ వసుచరిత్ర భట్రాజుగారికీ మహా దోస్తీ. ఈ పొట్టిమబ్బు కుర్రాడు 'సారిది.' ఆ పొడుంధట్టిస్తున్నవాడు 'తలమే' ఎలాగోవచ్చి వీళ్లలోపడ్డాడు." అన్నారు. ఆతురక ఎవరండీ వీరిలోఉన్నాడు అన్నారు సూర్యనారాయణశాస్త్రిగారు. నేను గుర్తించి ఇతడు పేక్రవరవసాయుబు. ఇరుగో స్త్రీ ప్రతినిధులు—ఈబక్కపలచని జూకాలావిడ 'అండజయాన.' ఆపచ్చ చీరావిడ 'భీతహరిణేక్షణ.' ఆ పడుచు 'శతపత్రేక్షణ.' అనేవరికి మావారిద్దరూ పొట్టలు పగిలేట్టు నవ్వుతూ సభాభవనంలోకి లాక్కుపోయారు నన్ను.

౭

ఆహ్వాన సంఘసమావేశము జరుగుతున్నది. అధ్యక్షులు 'జగన్నాథం' గారు, కార్యదర్శి 'మానుగ' గారు. తక్కిన ముగ్గురు సభ్యులు 'పోలుగ' 'పెలుచ' 'తద్దయు' గార్లు సభాప్రణాళిక, కార్యక్రమంగూర్చి మాట్లాడుకుంటున్నారు. ప్రణాళిక ఇట్లా సిద్ధమయింది:

(౧) ౮ గంటలకు బ్రహ్మాండమైన ఉత్సవముతో వీరేశలింగముతోటమీదుగా గోదావరిస్టేషనుకు వెళ్లి ధరాదేవిగారికి ఘనముగ స్వాగత మిచ్చుట.

(౨) యావన్మంది ప్రతినిధులతోను, సభ్యులతోను తిరిగివచ్చి తావన్మందితోను తదుపరి మజ్జన భోజనాదులాచరించుట

(3) ౨ గంటలకు మహాసభా ప్రారంభము.

(౪) అధ్యక్షిణిమెన్నికోలు.

(౫) ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము.

(౬) అధ్యక్షిణ్యుపన్యాసము

(౭) అఖండయతిఆక్రందనము

(౮) శ్రోత్రప్రతినిధుల కొన్నిమాటలు.

(౯) అభిశంసనతీర్మానములు.

(౧౦) సమాప్తి.

'జగన్నాథం' గారు లేచి "సోదరప్రముఖులారా, కార్య ప్రణాళిక కడుంగడు చక్కగా కుదిరినది. ఎనిమిది గంటలైనది.

లెండు. మన వంశప్రతిష్ఠ కంతకూను మూలవిరాడ్రూపిణి యగు నద్ధరాదేవి ఘనస్వాగతమునకై కదలిరండు." అని గంభీరంగా పలికేసరికి ప్రతినిధులందరూ సభాభవనం నిండిపోయి, 'ధరా దేవికీ— మహీరమణికీ— పుడమితల్లికీ—జై' అని తమ భక్త్యుత్సాహములు వెల్లడించి బారులుదీరి బయలుదేరారు.

స్వరయతులందరూ ఒకజట్టు. వ్యంజనవిరామము లందరూ ఒకగుంపు. బిందువిశ్రాంతుల చెట్టాపట్టాలు వెనుక. తరువాత విశేషవిరతుల శ్రేణి, అందరివెనకా అఖండయతిగారు అప్ప కవిని తిట్టుకుంటూ భావకవుల్లో కలసిపోదామా అని ఆలో చిస్తూ బయలుదేరాడు. ఇనక వేస్తే రాలని యతిపటాలంతో రోడ్డు ఉక్కిరి బిక్కిరి అవుతూ ఒక మహాప్రబంధంలా ఉంది.

ఊరేగింపు వీరేశలింగంతోటదగ్గరకు వచ్చేసరికి చటుక్కున ఇంకాకొందరిని వెంటబెట్టుకుని 'క్రందుగ' గారు ప్రాసప్ర ముఖులను వెదుక్కుంటూ వచ్చి కలిశారు.

తిన్నగా ఉత్సవం లక్ష్మీవారప్పేట దగ్గరనుంచి 'సర్కారు పశువుల వైద్యశాల' మీదుగా గోదావరి స్టేషనువద్దకు నడిచింది.

మెయిలువచ్చి స్టేషనులో ఆగింది. అమరప్రకారం అక్షరాలా ధరాదేవికుండే పేర్లజాబితా కంతటికీ జైజై కొడుతూ ఆహ్వాన సంఘంవారు ఆమె యెక్కిన పెట్టెకోసం జనాన్ని తోసుకుని పరుగెత్తుతూండగా, ఒకపెట్టెలోనుంచి తలంతా నెరిసి ఒకప్పుడు

తులలేని వైభవం అనుభవించిన ఒక ముసలావిడ తొంగి చూసింది.

'అదుగో వసుంధరాదేవిగారు' అంటూ జనం అంతా అటువెంపు పరిగెత్తారు. అవయవపటుత్వం తప్పినా సకలాంధ్ర కవిత్వరంగమూ అనివారుబయలుగా తిరిగిన ప్రాభవమూ, ఏఆంధ్రకవిఆపత్తులోనైనా అడ్డపడి కాపాడిన ఔదార్యమూ ముఖంలో ప్రతిఫలిస్తూండగా ధరాదేవి జరాభరంతో వణకుతూ దిగింది. ఆమె వెంట 'లీలా' కుమారి, 'లలి' కన్య స్వాగత పత్రాలూ, సంచీ పట్టుకుని దిగారు.

'మానుగ' జగన్నాథం' గార్లు గబగబ పరిగెత్తుకువచ్చి ధరాదేవి మెడలో కర్పూరపుదండలూ, పూల దండలూ వేసి సాష్టాంగంగా నమస్కరించి లేచారు. వచ్చిన ప్రతినిధులందరూ సాష్టాంగపడదా మనుకున్నారు గాని ప్లాట్‌ఫారం పట్టదనీ, పాసింజర్లు తొక్కి చంపేస్తారనీ భయపడి జంకి చేతులతోనే 'దండించి' తృప్తిపడ్డారు.

'సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్' లోంచి నవనాగరికులగు ముగ్గురు యువకులు 'పోజు' లిస్తూ దిగారు. జనంలో కొత్త ప్రతినిధులన్న గోల పుట్టింది. కార్యదర్శి 'మానుగ' గారు తెచ్చికోలునవ్వుతో తేరిచూసి 'అయ్యా, దయచేయండి! తమరు గుంటూరునుంచా, తెనాలినుంచా బయలుదేరారు' అన్నారు. 'అసలు మొన్నగుంటూరిలో బయలుదేరి తెనాలి

విన్న రాత్రికి వచ్చి ఉదయం బెజవాడలో బయలు దేరాం' అన్నాడు అందులో ఒకాయన. "తమ నామధేయం?"

"నాపేరు మధురం—ఈయన వలపుబరువు. ఆయన 'సుషమం.' ఏదో మీకుటుంబంలో వాళ్లమే కనక బంధువుల నందరినీ చూసిపోదామని వచ్చాం."

"మంచిపనిచేశారు. దయచేయండి"

'మానుగ' వారిని వెంటబెట్టుకుని మహాజనంలోకి వెళ్లాడు. లీలాకుమారి మధురాన్ని చూసి తన చురుకైన కళ్లను ఓరగా అప్పళించి పరిచయసూచకంగా నవ్వింది.

'ప్రేమ గుడ్డిది' అనుకున్నాడు 'వలపుబరువు.' ధరాదేవి కారుఎక్కుటకు నిరాకరించగా రెండెడ్లబండిమీద ఆమెను ఎక్కించారు. 'లలి' కన్య ఆమెతో బండీలోనే కూచుంది. లీలాకుమారి, కొత్తప్రతినిధులూ కారులో ఎక్కగా కాగు బ్బరుమంది.

జ

మూడు గంటలకు మహాసభ ప్రారబ్ధమయింది.

స్త్రీల ప్రత్యేకస్థలంలో స్త్రీప్రతినిధులు కూర్చున్నారు. 'లీల' వారందరికీ నాయకరాలులాగ కొంచెంముందు కూచుని 'మధురం' మీద ఓకన్ను ఉంచింది. అంతట కార్యదర్శి 'మానుగ' లేచి కన్నులు మూసి, 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ' అని దైవప్రార్థన చేయగా 'ఎవ్వనిచే జనించు' కూడా

చదివితీరాలి. చదవకపోతే లేచి వెళ్లి మేమింకోసభ పెట్టుకుంటాం" అని ఓరుగల్లు ప్రతినిధులు తీవ్ర—గగ్గోల చేశారు. ఓమూలనుంచి రాజమండ్రి పెద్దమనిషి లేచి "అయితే 'శ్రీమద్భానుసహస్ర' ఒదిలిపెట్టవలసిందేనా?" అని గద్దించాడు. మధురంజెండాలా లేచి ఫక్తు బంగాళీలో "గీతాంజలిలోవి పదిలైనులు చదివితేగాని మేం ఒప్పుకోం" అన్నాడు. చట్టుస 'జగన్నుతం'గారు లేచి కాంగ్రెసువాదిభీకరారావంతో

"నాయనలారా! అమ్మలక్క—నాయనమ్మలారా! బ్రహ్మాండమైన కార్యక్రమము ముందుబెట్టుకొని దైవప్రార్థనకై తగవులాడుట వట్టి ఆంధ్రత్వము. ఆభారతామ్నాయగంగా భగీరథునియందు, ఆవాగనుశాసనునందు మీకు గౌరవము లేదా! పెండియు నఖండ గౌతమీ జలకణహల్లోహాల మదబంభర మల్లధ్వనుల నుల్లసులరు ఉద్దండమండలేశ్వాగ చండకాండాతికాండ నికురుంబకరంబిత రాజరాజ నరేంద్రచంద్రు పేరోలగము వంటి ఈ 'ధీరోలగము' న నింత పూచీలేని పేచీలు లేవనెత్తుట భావ్యమా? సంభావ్యమా" అని గర్జించి అల్లరి సర్ది "ఏ దేవి యాంధ్రేశుభావంబున స్థావరజంగమ ప్రపంచము కాలూని క్రాలుచున్నదో, ఏదయామయస్వాంత యనుగ్రహంబున నన్నయాది కవులు, వేమనాది యోగులు కృత్యాద్యవస్థ దాటి కృతకృత్యులైరో, ఏ యుదారశీల గంటముదించి, ఆకుచించి ఆలోచన తెగక తన్నుకొనిచచ్చు ఆంధ్రకవుల కడ్డపడి ఆపత్తుపాటించెనో

అట్టి శ్రీ వసుంధరాదేవిగారు దయచేసి అధ్యక్షపీఠ మలంక రింతురుగాక.'' అని ఉరిమి కూర్చున్నారు.

"ముసలాళ్లు అధ్యక్షపీఠాలు వదులుకుంటేగాని ఈదేశం బాగుపడ'' దన్నాడు మధురం. వెంటనే ఒణుకుతూ అధ్యక్ష పీఠానికి తడుముతున్న ధరాదేవి చేయిపట్టు 'లలి' కన్య పీఠం ఎక్కించింది. కార్యక్రమం ప్రకారం ఆహ్వానసంఘాధ్యక్షులు తమ ఉపన్యాసం ఇట్లా ప్రారంభించారు:

"అయ్యామ్మలారా! అఖిలాంధ్రయతిప్రాస మహాజనులారా! స్వాగతము. సుస్వాగతము. నేను ఇప్పుడు ఇక్కడ మనము ఎందుకు సమావిష్టులమైతిమో యందఱకుం తెలిసినయది కాదా? ఒకప్పుడు మనము తులలేని గౌరవమును, వెలలేని కానుకలను సింపుదళులకొత్త సంపాదించినవారమె కామా! మన వంశము బహుపురాతనమని యిటీవల దొరికిన కరక్కాయవలస మరణశాసనముంబట్టి సువిదితమైనది కాదా? రాజరాజ నరేంద్రుని మొదలు రఘునాథరాయలవఱకు మనధాటి కెదు రొడ్డిన వారున్నారా?

నన్నయ మొదలు చిన్నయదాక మనల గాదని కాలుకదిపిన వారున్నారా? బాలకవి పార్ధసారథిశతకము దగ్గరనుండి మహాకవి భారతమువరకు మనము పెట్టినది భిక్షకాదా! (పొంగివచ్చే కన్నీళ్లు తుడుచుకొని) చచ్చి స్వర్గముననున్న నన్నయతాతగారు వసియున్నను లేకున్నను నన్ను బిలిచి యభిమానపుత్రునిగా జూచిన దినములు తలచుకొన్న నాకు

దుఃఖము వచ్చుచున్నయది. కన్నీరు మున్నీరగుచున్నది. క్రందుగ బాష్పరోధమున కంఠమునన్' జెడుచున్నది. అయినను గొన్ని సంగతులు మనవిజేసి విరమింతును.

"నేడు కొందరు మన మహాకవు లిచ్చిన ప్రబంధరాజముల జదివి బాగుపడిపోయి, ఎదురుతిరిగి, పొల్లుపదములు, పడికట్టు రాళ్లు అని మన 'భవిష్యము' తీయుచున్నారు. చెల్లరే యిది యెంత విశ్వాసఘాతుకత్వము! అస్మత్కచెల్ల వీరి నమ్మగ జెల్లదు. వంకాయలబజ్జీవలె వట్టి గీతపద్య మిప్పటివారి కారాధ్యమైనది. ఇందు యతి సోదరులకు భిక్ష దొరకినను ప్రాస ప్రముఖుల ప్రాణములు పోవుచున్నవి. ఉభయులను గౌరవించు తెలివి వీరికి లేదా? నేటి కాలపు డిప్రెషన్ పద్యములకుగూడ ప్రాకినదా! (భీకరంగా) ఆశార్దూలము లేమి! (గర్వంగా) ఆమత్తేభము లేమి! (మృదువుగా) ఆ చంపకమాలలేమి? (సువాసనగా) ఆ ఉత్పలమాలలేమి! వాని 'ఘసందు' ఈ తుక్కు-గీతములకు, నీ చొప్పగేయములకు వచ్చునా? మెచ్చుదెచ్చునా? ఇన్నీ యివి లెన్నుయే? (సభలో: ఆహా ఏం కొట్టేస్తున్నాడయ్యా దెబ్బలు. బలే! అనే అభినందనాలు) ఏమయినను పోయినది - పోయినది. ఆంధ్రకవిత్వప్రతిష్ఠ అడుగంటినది. పాపము గోపాలకృష్ణయ్య ఏమన్నాడు? "కొతిమీరికవిగాళ్ల గతు లయోమయములై నన్ను వీథిని బెట్ట నెన్నుచుండ" అని ఆంధ్రమాత ఆవేదనగా వినిపింపలేదా? లేవరేమి? నడుములు బిగింపరేమి? కాళ్లెగుర వేయరేమి? అల్పులము మన మేమి చేయగలమని యోడకుడు.

చెప్పలేదా చిన్నయసూరి మహాకవి 'గడ్డివెంటి గంధగజమును బంధించు' నని, కావున మనముందరము మన నవమానించిన క్రొత్తకవులను కెక్కు కెక్కుమనిపించుట కొక కొంగొత్త మార్గము కనిపట్టి ప్రచారముచేయ నీమహాసభాసన్నాహము జేసితిని. అది యెట్టిదన :— క్రొత్తకవుల యూహాలు విదేశీయములైనను భాష స్వదేశీయ కావలయును. కనుక వారు భాష కొఱకు ప్రబంధములు జదువునప్పుడు మనము మూతిబిగించి బిర్రబిగిసితిమేని యతడు ఎంత తన్నుకొనినను మన యాంతర్యమును దెలిసికొనలేక చివరకు మనకు దాసోహమును చెప్పినట్టు వినును. ఈఘనకార్యమునకు మీరందరు లేక మనస్సులై తోడ్పడినచో కుఱ్ఱకవులను ఘడియలో లొంగదీయగలను.

"నేను చిరకాల మీయుఖండగౌతమి నఘమర్షణ స్నానమాచరించి, సారంగధరపర్వతమున ఘనతపం బాచరించి ఈసహాయనిరాకరణోద్యమమును గనిపట్టినాను. గాంధీ నాప్రియశిష్యుడు. చెప్పమరచినాను.

"వజ్ఝులపండితాదులు వసుచరిత్ర విమర్శనాదికములో మనము వ్యర్థులమని దూషించినను నలుగురిలోను మనము లేకున్న రసభంగ మగునని చెప్పుచుండుటచే వారి నెంతయు మన మభినందింపవలసియున్నది. ఇక మనమనిన నోర్వలేని ముగ్గురను తీవ్రముగ నభిశంసింప వలసియున్నది. సోదరులారా! చాలతడవైనది. నేను సూచించిన ఉత్కృష్టపద్ధతి ననుసరించి వంశప్రతిష్ఠ నిలువంబెట్టుడు.

అని జగన్నాథంగారు సుఖాసీనులు కాగా ఉవ్వెత్తుగా రేగిన తప్పెటలవంటి చప్పట్లమధ్య ధరాదేవి లేచి "చిరంజీవులారా! ఎందరో మహానుభావు లుండగా నన్ను, ఈ ముసలిముత్తైదువను అగ్రాసన మెక్కించుట కేవలము తమకున్న స్త్రీగౌరవమె యని చెప్పకతప్పదు. ఇంత మహోన్నతపదవికి నేను తగను. శ్రీనాథాదికవిరాజులు నామీద నిష్కారణ గౌరవము చూపినట్లె మీరును వృద్ధురాలనగు నామీద నింతయాదరమ్ము, ప్రాముఖ్యమునుంచి మీస్వాభిమానము ప్రదర్శించినందుకు నేను కృతజ్ఞత మెఱిగినదానను.

"నా జీవము, జవము నేనాడో తెనుగుకవులకే ధారపోసిన నేను ఈ జరాభరమున నేమియు మాటలాడజాలను. అదియునుగాక శ్రీజగన్నాథంగారే చెప్పవలసినదంతయుం జెప్పి నా భారము తగ్గించినారు. వారి యమూల్యోపదేశముల ననుసరించి మీరందరు కృతకృత్యులగుదురు గాకమని కోరుచున్నాను" అని చదికిలబడగా చివ్వున అఖండయతి లేచి "జ్ఞాతిశ్చేదనలేన కిమ్మనెడి వాచా సత్యంబుగా మీరు నన్ను దరిజేరనీక తరిమికొట్టినారు. నామీద ఆదరంచూపిన కొత్త కవుల వ్యావహారిక భాషతోనే మాట్లాడుతాను.

భారతకవులు నన్నభిమానించినా అప్పకవి వాడి సొమ్మంతా పడిపోయినట్టు నన్ను కాదని అడ్డమైన గడ్డీ కరచాడు. నా సోదరుడు రలయతికి విషమే పెట్టాడు. నన్ను ఆదరించిన అభినవకవులను సమ్మానించి మేమిద్దరం వారితోటే ఉంటాం.

మేము మీలో ఎప్పటికీ కలియం. నాకు మీసంస్థలో సంబంధం లేదు." అని దబాయించి చెప్పి కూర్చున్నాడు. యతిప్రముఖులు మండిపడి "ఏల చొరంగనిచ్చితిరి యిత్తురకన్ మన సీమలోనికిన్" అన్నట్టు ఉగ్రులై చూశారు. క్రొత్తప్రతినిధులలో 'మధురం' లేచి 'జగన్నాథంగారి అభిప్రాయాలతో కొంతవరకూ ఏకీభవిస్తాం. అట్టే చెప్పవలసింది లేదు' అని కూర్చున్నాడు. కార్యదర్శి లేచి 'మహానుభావులరగు నస్సోదరులారా! తమరందరు సాదరభావముతో నందందు తోడ్పడి సభ జయప్రదముగా జరిపించినందులకు నిదే వేనవేలు కృతజ్ఞతావందనము లర్పించుచున్నాను. ఈ తీర్మానములను తామందరు చిత్తగించి సమ్మతింప గోరుచున్నాను.

౧. ప్రస్తుతము, మన సంఘమును బహిష్కరించి క్రొత్త త్రోవలను ద్రొక్కుచున్న ఇప్పటి కవులు ప్రబంధములం బట్టుకొనినచో వారి కడుగడ్డున నడ్డుతగిలి యేడిపించుటకు నీసభ వారు తీర్మానించుచున్నారు.

౨. తమ విమర్శనలలో మనము వ్యర్థులమని దూషించి వ్రాసినను, నలుగురిలోను మనవల్ల రస ముప్పతిల్లునని చెప్పు వఝులపండితాదుల నీసభవారు అభినందించుచున్నారు.

౩. మనలను పీఠికలలోను, పత్రికలలోను దూషించి యువపరములకు జెడిన ఛందోదర్పణపీఠికాకారుడు సీతాపతి, యతి ప్రాసవైచిత్రికములని యుగాదిసంచికలో వ్రాసిన సూర్యనారాయణశాస్త్రి, పద్యములలో యతిప్రాసలుత్రోసి మనపై

కత్తికట్టిన హనుమచ్ఛాస్త్రిగార్లను ఈ సభవారు మిక్కిలి గర్హించుచున్నారు.

సభ్యులంతా 'భేష్' అని చప్పట్లుకొట్టి, అట్టహాసాలు చేసి తమ ఆమోదమును తెలియజేస్తూ సభలోంచి లేచారు. మేమెవరమో తెలియకుండా బయటపడేటప్పటికి బ్రహ్మాండమయింది.

వనదేవతలు

చార్వాకమహర్షి ఆశ్రమం. చతురస్రంగా ఉంటుంది. చుట్టూ మహావృక్షలకుమల్లే పెద్దపెద్ద టేకిచెట్లూ వాటిమధ్య మధ్య జీలుగుచెట్లూ నాలుగుపక్కలా నాలుగు వెదురుపొదలూ దట్టంగా కప్పుకొని ఉన్నాయి.

ఒకపక్కను, ఎత్తైనప్రదేశంమీద పెద్దమర్రిచెట్టూ, దాని కింద పూరి, రెల్లు, తాటి, చిక్కగానేసిన చిన్న ఇల్లూ ఉన్నాయి.

పొదనీడను ఒకజింకపిల్లను తొడమీదబెట్టుకుని చిగుళ్లు మేపుతూఉన్న ఆ అమ్మాయిపేరు కురంగి. ఆమెకు జింకపిల్ల లంటే మహా—యిష్టం. కనుకనే తండ్రిగారు ఆఅమ్మాయిని కురంగి అన్నారు. ఆమెకళ్లనిండా పెంకెతనమూ—ముఖం నిండా లావణ్యమూ పరుగులువారుతూ ఉంటాయి.

దానికికొంచెం ఎడంగా వాలఖిల్యమహాముని ఆశ్రమం. దానిచుట్టూ మొగలిడొంకలు చిక్కగాపూసి మెరుస్తున్నాయి.